ఆటోనగర్ పనులు వేగవంతం చేయాలి

ఇమాంపేటలో ఆటోనగర్ ఇండస్ట్రియల్ పార్క్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

- కలెక్టర్ వెంకట్రావ్
- ఇమాంపేటలో ఆటోనగర్ ఇండస్ట్రియల్ పార్కుస్థలం పరిశీలన

సూర్యాపేట రూరల్, మార్చి 23 : ఆటోనగర్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. మండలంలోని ఇమాంపేట గ్రామ సమీపంలో ఆటోనగర్ ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించిన స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆటోనగర్‌కు ఇప్పటికే కొంత భూమిని కేటాయించామన్నారు. రైతుల నుంచి మరికొంత భూమిని సేకరించాల్సి ఉండగా.. కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఏర్పాటు పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. కోర్టులో ఉన్న భూములకు కౌంటర్ ఫైల్ వేయాలని ఆర్డీఓను ఆదేశించామని కలెక్టర్ చెప్పారు. ఈ నెల 27న రెవెన్యూ, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ అధికార జోనల్-7 మేనేజర్‌తో జరిగే సమావేశానికి లేఅవుట్స్ సిద్ధం చేసుకొస్తారని, వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం ఇమాంపేట గ్రామ సమీపంలోని తాగునీటి శుద్ధి కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి సరఫరా తీరును ఏఈ జనార్దన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ వద్ద గ్రిడ్ డీఈ రాజేందర్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య నివారణకు మండలం, మున్సిపాలిటీకి ఒకటి చొప్పున జిల్లా అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమిటీలు గ్రామాల్లో పర్యటించి తాగునీటి తీవ్రతను గుర్తించి ఎప్పటికప్పుడు వివేదికలు అందిస్తాయన్నారు. కమిటీ సభ్యులతో ఆర్డీఓలు వారంలో రెండు సార్లు సమీక్ష నిర్వహించాలని సూచించారు. ప్రతి గురువారం జిల్లా స్థాయిలో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చర్యలు

పెన్‌పహాడ్ : పదో తరగతి పరీక్షలకు ప్రతి కేంద్రానికి ఓ ప్రత్యేక అధికారిని నియమించినట్లు, పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, విద్యార్థులకు కల్పించిన వసతులపై ఆరా తీశారు. అనంతరం లోక్‌సభ ఎన్నికలో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, తదితర మౌలిక వసతులు ఉండేలా చూడాలని తాసీల్దార్ మహేందర్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటయ్య, డీఓ వెంకన్న, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంఈఓ రవి, సిట్టింగ్ స్క్వాడ్ వహిదాబేగం పాల్గొన్నారు.

ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ బీఎస్ లత

వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

సూర్యాపేట, మార్చి 23 : ఓటు అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అందుకు స్వీప్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటుతో మంచి పరిపాలన తెచ్చుకోవచ్చన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగేలా ప్రతి ఒక్క రూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ అప్పారావు, ఎల్‌డీఎం బాపూజీ, డీఆర్‌డీఓ మధుసూదనరాజు, ఏఓ సుదర్శన్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండిన పంటలకు నష్ట పరిహారం అందించాలి

- ఆర్డీఓకు రైతు సంఘం నాయకుల వినతి

హుజూర్‌నగర్‌లో ఆర్డీఓ కార్యాలయ ఎదుట ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

హుజూర్‌నగర్, మార్చి 23 : సాగునీరు లేక ఎండిన పంటలకు నష్ట పరిహారం అందజేయాలని శనివారం అఖిల భారత రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల చేస్తారన్న ఆశతో రైతులు హుజూర్‌నగర్ డివిజన్ పరిధిలో వరి పంట సాగు చేశారని, సకాలంలో నీరందక పంటలు ఎండిపోవడంతో ఎకరానికి రూ.30 వేల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కనకారావు, అంజయ్య, సాంబయ్య, లఘుపతి, వెంకటి, నగేశ్, శ్రీను, లచ్చయ్య, సైదా పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో భూసారం వృద్ధి

- ఎన్ఎఫ్ఎల్ స్టేట్ మేనేజర్ సురేశ్‌కుమార్ ఉజ్జనియ

గరిడేపల్లి : గడ్డిపల్లి కేవీకేలో రైతులకు జీవన ఎరువును పంపిణీ చేస్తున్న ఎన్ఎఫ్ఎల్ స్టేట్ మేనేజర్ సురేశ్‌కుమార్ ఉజ్జనియ

గరిడేపల్లి, మార్చి 23 : సేంద్రియ వ్యవసాయంతో భూసార వృద్ధి జరుగుతుందని నేషనల్ ఫెర్టిలైజర్ లిమిటెడ్ స్టేట్ మేనేజర్ సురేశ్ కుమార్ ఉజ్జనియ అన్నారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల కేవీకేలో నేషనల్ ఫెర్టిలైజర్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, సమగ్ర పోషక యాజమాన్యంపై శనివారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవ ఉత్పత్తులు రసాయనిక మందులకు సమానంగా పని చేస్తాయన్నారు. కేవీకే ఇన్‌చార్జి పీసీ డి.నరేశ్ మాట్లాడుతూ.. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆచరించాలన్నారు. ఇలా వచ్చిన దిగుబడులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. అనంతరం రైతులకు 500 ఎం.ఎల్ పాస్పో బ్యాక్టీరియా ద్రవరూప జీవన ఎరువు, 2 కేజీల సూక్ష్మపోషకాల మిశ్రమంను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎల్ జిల్లా ఇన్‌చార్జి మృత్యుంజయ దాస్, కేవీకే శాస్త్రవేత్తలు ఎ.కిరణ్, సీహెచ్.నరేశ్, డి.ఆదర్శ్, టి.మాధురి, ఎన్.సుగంధి పాల్గొన్నారు.

'ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలి'

చిలుకూరు, మార్చి 23 : ఇంజినీరింగ్ విద్యార్థులు సబ్జెక్టులతో పాటు ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలని బెంగళూరుకు చెందిన వరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధి సుష్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రాక్టికల్ పద్ధతిలో ప్రతి అంశాన్ని నేర్చుకోవాలని సూచించారు. కళాశాల అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని రాణించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- ఆర్డీఓ శ్రీనివాసులు

నేరేడుచర్ల : మంచినీటి సరఫరాపై మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆర్డీఓ శ్రీనివాసులు

నేరేడుచర్ల, మార్చి 23 : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు అధికారులు ఆదేశించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో మంచినీటి సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చోట్ల నూతన బోర్లను వేయడంతో పాటు పాత బోర్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అవసరమైతే వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపీపీ ఆశ

మోతె, మార్చి 23 : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ ముప్పాని ఆశాశ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను సూచించారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీఓ హరిసింగ్, జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, వైస్ ఎంపీపీ మైనంపాటి సునిత, సూపరింటెండెంట్ వెంకటాచారి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు : ఎంపీపీ బిందు

మునగాల : మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఎలక బిందు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు సభలో నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాల్, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, జడ్పీటీసీ నల్లపాటి ప్రమీల, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, సహకార సంఘం చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, తొగరు సీతారాములు, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

తాగు టి ఇబ్బందులు లేకుండా చూడాలి : ఎంపీపీ జ్యోతి

నడిగూడెం : గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ యాతాకుల జ్యోతీమధుబాబు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో బోరింగులు, ఓవర్ హెడ్ ట్యాంక్‌లను అధికారులు పర్యవేక్షించాలని, ఎక్కడైనా తాగునీరు రాకపోతే గ్రామ పంచాయతీ ట్యాంకర్లను ఉపయోగించి నీటి సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ హేమమాలిని, ఎంపీడీఓ ఇమాం, జడ్పీటీసీ బానాల కవితానాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

- తాసీల్దార్ సంఘమిత్ర

ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మోతె, మార్చి 23 : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తాసీల్దార్ సంఘమిత్ర హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో బోర్డు ఏర్పాటు చేసి మాట్లాడారు. మోతె రెవెన్యూ పరిధిలో సర్వే నం. 238లో 5ఎకరాల 31గుంటల ప్రభుత్వ భూమిని డబుల్ బెడ్రూం ఇండ్లకు కేటాయించడం జరిగిందన్నారు. అందులో గతంలో 61 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఖాలీ ప్లాట్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేసేవారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

నమో డ్రోన్ దీదీతో మహిళలకు ఆర్థిక చేయూత

- జనరల్ మేనేజర్ ఫారూక్ హుస్సేన్

డ్రోన్ పంపిణీ చేస్తున్న ఫారూఖ్ హుస్సేన్

నాగారం, మార్చి 23 : గ్రామీణ మహిళలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నమో డ్రోన్ దీదీ పథకానికి శ్రీకారం చుట్టినట్లు పారదీప్ పాస్పేట్ లిమిటెడ్ జాయింట్ జనరల్ మేనేజర్ ఫారూక్ హుస్సేన్ తెలిపారు. తొలి విడుతలో ఈ పథకం కింద శిక్షణ పూర్తి చేసిన 12 మంది డ్వాక్రా సంఘ మహిళలకు గురువారం మండలంలోని ఫణిగిరి గ్రామంలో డ్రోన్ పంపిణీ చేసి మాట్లాడారు. మహిళా సాధికారత సాధించడంతో పాటు వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను రైతుల దరి చేర్చేందుకు పీఎం ఈ పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ జిల్లా మేనేజర్స్ జి.ఎల్.లక్ష్మీకిశోర్, బి.వెంకటప్రవీణ్, ఎస్.మెహబూబ్‌బాషా పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణ మన చేతిలోనే

- మండల వైద్యాధికారి డాక్టర్ స్రవంతి

అనంతగిరి : చనుపల్లిలో క్షయ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెన్‌పహాడ్, మార్చి 23 : క్షయ వ్యాధి నివారణ, వ్యాప్తి చెందకుండా నిరోధించడం మన చేతిలోనే ఉన్నదని మండల వైద్యాధికారి డాక్టర్.స్రవంతి అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ అనంతలక్ష్మి, హెచ్ఈఓలు చంద్రశేఖర్‌రాజు, శ్రీనివాస్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అనంతగిరి : మండలంలోని చనుపల్లిలో క్షయ వ్యాధి నిర్ధారణకు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిపురవరం పీహెచ్ఎసీ సూపర్‌వైజర్ విజయకుమార్ మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలుంటే క్షయ వ్యాధి పరీక్ష చేయించుకోవాలన్నారు. దీర్ఘకాలం మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నెలకు రూ.500 పౌష్టికాహారం కోసం అందిస్తుందని, మందులు ప్రభుత్వ దవాఖానలో ఉచితంగా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ల్యాబ్ టెక్నిషియన్ మహేశ్, సిబ్బంది సుభాషిణి, భార్గవి, పద్మావతి పాల్గొన్నారు.

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్ట్ దుర్మార్గం

- ఆప్ జిల్లా అధ్యక్షుడు రాజమల్లయ్య

కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఆప్ జిల్లా అధ్యక్షుడు రాజమల్లయ్య

బొడ్రాయిబజార్, మార్చి 23 : ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇందారపు రాజమల్లయ్య అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో గతంలో ఎన్నడూ లేని విధంగా పేదలకు కార్పొరేట్ వైద్యం, విద్య, ఉచితంగా విద్యుత్, మెరుగైన మంచినీరు అందిస్తూ ప్రజాధరణ పొందిన సీఎం కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీతో పాటు పంజాబ్‌లో ఆప్ అధికారం చేపట్టి హర్యానా, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో విస్తరిస్తున్నదని ఆప్ ఎదుగుదలను చూసి జీర్ణించుకోలేకనే కేంద్రంలోని బీజేపీ కక్ష్య గట్టి అక్రమ కేసులు బనాయిస్తుందన్నారు. కేంద్రం ఎన్ని కుట్రలు పన్నినా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆప్ అద్భుత విజయాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తక్కెళ్లపల్లి శ్యామ్‌కుమార్, యూత్ ప్రెసిడెంట్ తక్కెళ్లపల్లి ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు మారగాని సైదులు, జాయింట్ సెక్రటరి సుంచు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు వల్లంపట్ల తిరుమలేశ్, మేరి శైలజ పాల్గొన్నారు.

ఫణిగిరిలో వైభవంగా పుణ్యాహవాచనం

నాగారం, మార్చి 23 : రాష్ట్రంలో రెండో భద్రాద్రిగా వెలుగొందుతున్న మండలంలోని ఫణిగిరిలో గల సీతారామచంద్రస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం డప్పు వాయిద్యాలతో పుణ్యాహవాచనం, ప్రబంద సేవాకాల కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్ (నర్సింహారావు), వైస్ చైర్మన్ కల్లెట్లపల్లి సోమయ్య, యాదగిరి, భిక్షం, నాగమణి, శంకరయ్య, రవీందర్ ఆచార్యులు, కూరేశం సంతోష్‌కుమార్, సాయి దత్తు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి, మార్చి 23 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణాన్ని ఆలయ అర్చకులు శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణ మండపంలో కల్యాణతంతు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ సిరికొండ నవీన్, భక్తులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

మునగాల, మార్చి 23 : మండల పరిధిలోని వెంకట్రామాపురం గ్రామానికి చెందిన గర్భవతి కొండమీది మౌనికకు పురటినొప్పులు రాగా ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనానికి సమాచారం అందించారు. 108 సిబ్బంది మౌనికను కాన్పు కోసం సూర్యాపేట ఏరియా దావాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ ఇమాంపాషా చికిత్స నిర్వహించగా సాధారణ ప్రసవం అయినది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు.

నారాయణపురం సొసైటీ అధ్యక్షుడిగా మట్టయ్య

చిలుకూరు, మార్చి 23 : మండల పరిధిలోని పాలెఅన్నారం పీఏసీఎస్ తాత్కాలిక అధ్యక్షుడిగా దేశబోయిన మట్టయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. సంఘం చైర్మన్ అవినీతికి పాల్పడుతూ సంఘం డబ్బులను సొంత అవసరాలకు వాడుకున్నట్లుగా రుజువు కావడంతో అతడిని చైర్మన్ పదవి నుంచి తొలగించారు. అనంతరం జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు సంఘ కార్యకలాపాల నిర్వహణకు తాత్కాలిక అధ్యక్షుడిగా మట్టయ్య బాధ్యతలు స్వీకరించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నాగారం, మార్చి 23 : పేరబోయినగూడెం బిక్కేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మండలంలోని పేరబోయినగూడెం గ్రామ సమీపంలో బిక్కేరు వాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా శుక్రవారం రాత్రి ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి డ్రైవర్, ఓనర్‌పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

అర్వపల్లి : ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సదరు వ్యక్తులకు జరిమాన విధించడమే కాకుండా ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేసి జైలుకు పంపిస్తామని తెలిపారు. వాహన యజమానిపై కూడా క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

'జాతీయోద్యమంపై యువత అవగాహన పెంచుకోవాలి'

బొడ్రాయిబజార్ : నేటి యువత జాతీయోద్యమంపై పెంచుకోవాలని జాతీయోద్యమ ప్రచారకుడు కుసుమ సిద్దారెడ్డి అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా స్థానిక నవోదయ పాఠశాలలో తెలంగాణ అమరుడు వేణుగోపాల్‌రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయోద్యమంపై అవగాహన కల్పించి క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాద విధానాలపై ఉద్యమించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

బొడ్రాయిబజార్ : భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బొడ్రాయిబజార్, మార్చి 23 : విప్లవ యువ కిశోరం భగత్‌సింగ్ స్ఫూర్తితో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలపై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అలాగే సూర్యాపేట పూర్వ మిత్ర మండలి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కోట గోపి, నరసింహరావు, వెంకట్‌రెడ్డి, చినపంగి నర్సయ్య, నల్లపాటి అప్పారావు, తన్నీరు యాదగిరి, వీర్లపాటి వెంకన్న, అక్కినపల్లి వినయ్, తాళ్ల వినయ్, తండా రమేశ్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల : భారత స్వాతంత్ర పోరాట యోధులు సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని నేరేడుచర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ డివిజన్ కన్వీనర్ వాస పల్లయ్య వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సీపీఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు ఊదర వెంకన్న పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : వామపక్ష, రైతు, కార్మిక సంఘాల అధ్వర్యంలో పట్టణ పరిధి ఖమ్మం క్రాస్ రోడ్డులో భగత్‌సింగ్ విగ్రహానికి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదర వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళి అర్పించారు. కిసాన్ మోర్చ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొడ్డ వెంకటయ్య, సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.ముత్యాలు పాల్గొన్నారు.

పాలకవీడు : ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాలకవీడు మండల కేంద్రంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రామిక భవన్‌లో భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీవైఎల్ జిల్లా కార్యదర్శి ధరావతు రవి, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

చిలుకూరు : చిలుకూరులోని సీపీఐ భవన్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు అనంతుల రాము, కార్యదర్శి కడారు మధు పాల్గొన్నారు.

నూతనకల్ : దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు భగత్‌సింగ్ అని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో తోట్ల మల్సూరు స్మారక భవనం